రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి

- మంత్రివర్గంలోకి దానం నాగేందర్
- నిజామాబాద్ నుంచి ఒకరికి చాన్స్
- పలువురు మంత్రుల శాఖలు మార్పు
- త్వరలో వైద్యారోగ్యశాఖ ప్రక్షాళన
- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర హోం శాఖ బాధ్యతలను త్వరలో మంత్రి సీతక్కకు అప్పగించనున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా పేర్కొన్నట్టు సమాచారం. మంత్రి సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన దానం నాగేందర్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటారని చెప్పినట్టు తెలిసింది. నిజామాబాద్ జిల్లా నుంచి కూడా ఒకరికి మంత్రి పదవి దక్కనున్నదని పేర్కొన్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అంతేకాదు.. ఇప్పుడు ఉన్న పలువురు మంత్రుల శాఖలు మారబోతున్నాయని చెప్పినట్టు సమాచారం. అయితే.. ఫిరాయింపుదారులకు మంత్రి పదవి ఇవ్వబోమని, కాంగ్రెస్ బీ-ఫారంపై గెలిచిన వారికే పదవి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు కదా?.. అని ప్రశ్నించగా, ఎప్పటికీ ఒకేలా ఉంటుందా? అని సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. కాలాన్ని బట్టి రాజకీయాలు మారుతూ ఉంటాయని అన్నారట. 2018లో రాహుల్ గాంధీ స్వయంగా ప్యారాచూట్ నేతలకు టికెట్లు ఇవ్వబోమని చెప్పారని, అది అమలు కాలేదు కదా? అనేక మంది ప్యారాచూట్ నేతలకు టికెట్లు ఇవ్వాల్సి వచ్చింది కదా అని ఉదహరించినట్టు సమాచారం.

వైద్యారోగ్యశాఖ ప్రక్షాళన

వైద్యారోగ్య శాఖలో త్వరలో భారీ ప్రక్షాళన చేయనున్నట్టు మంత్రి చెప్పినట్టు సమాచారం. ప్రస్తుతం వైద్యారోగ్యశాఖలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) పరిధిలో ప్రాథమిక వైద్యం, తెలంగాణ వైద్యవిధాన పరిషత్తు(టీవీవీపీ) ఆధ్వర్యంలో సీహెచ్‌సీలు, ఏరియా దవాఖానలు, డీఎంఈ పరిధిలో మెడికల్ కాలేజీలు, జిల్లా దవాఖానలు కొనసాగుతున్నాయి. ఈ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా ఉన్నదని మంత్రి పేర్కొన్నారట. టీవీవీపీని, డీపీహెచ్‌ను కలిపి కొత్త వ్యవస్థ ఏర్పాటు చేసేలా ఆలోచిస్తున్నామని చెప్పారట. తద్వారా భవిష్యత్తులో వైద్యవిద్యకు డీఎంఈ, ఆరోగ్య సేవలకు హైల్త్ డైరెక్టరేట్ మాత్రమే ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు వెల్లడించారని సమాచారం. త్వరలోనే అమలు చేస్తామని అన్నట్టు తెలిసింది. 'కేంద్రం నిర్వహించే ఏ పరీక్ష అయినా నిర్వహించే శక్తి రాష్ట్రానికి కూడా ఉన్నది. నీట్‌ను రద్దు చేయాలా? కేంద్రం నిర్వహించాలా? రాష్ట్రాలకు ఇవ్వాలా? అనే అంశంపై ఆరోగ్యకరమైన చర్చ జరగాలి. ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీల్లో హాస్టళ్ల భవనాలకు పది రోజుల్లో శంకుస్థాపన చేసి, రెండేండ్లలో నిర్మాణం పూర్తి చేస్తాం. కొత్త మెడికల్ కాలేజీలకు ఇంకా అనుమతులు రావాల్సి ఉన్నది' అన్నట్టు సమాచారం.

ఏపీలో పింఛన్ రూ.4వేలు.. మనకెప్పుడు?

- అక్కడ నెలరోజుల్లోనే అమలు
- ఏడు నెలలైనా ఇక్కడ అతీగతీలేదు
- ఇంటింటికీ వెళ్లి ఇచ్చిన సీఎం చంద్రబాబు
- ఇక్కడ ఊసెత్తని సీఎం రేవంత్‌రెడ్డి
- ఏపీలో మూడు నెలల బకాయిలూ చెల్లింపు
- తెలంగాణలో ఉన్న పింఛన్‌తోనే లెక్కసరి



లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న ఏపీ సీఎం చంద్రబాబునాయుడు

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పేరుతో సామాజిక పింఛన్ల పంపిణీని సీఎం చంద్రబాబునాయుడు సోమవారం ప్రారంభించారు. మంగళగిరి నియోజకర్గంలోని పెనుమాకలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు సీఎం చంద్రబాబు స్వయంగా పింఛన్ అందించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పింఛను పెంపు ఏప్రిల్ నుంచే అమలు చేస్తున్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 65.31లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేశారు. పెంచిన పింఛను రూ. 4వేలతో పాటు గత మూడు నెలల బకాయి సొమ్ము కూడా కలిపి ఇచ్చారు. నెలకు రూ. 4వేలతో పాటు అదనంగా రూ.3వేలు కలిపి మొత్తం రూ.7వేలు ప్రభుత్వం పంపిణీ చేసింది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, కళాకారులు, డప్పు కళాకారులు, ట్రాన్స్‌జెండర్లు వంటి వారికి ఇకపై రూ. 4వేల పింఛను అందనున్నది. దివ్యాంగులకు రూ.3వేల నుంచి రూ.6వేలు చేయగా, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి రూ.5వేల నుంచి రూ.15వేలు చేస్తూ నిర్ణయం చేశారు.

అక్కడ అలా.. ఇక్కడెప్పుడు ?

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరి నెల రోజులు కూడా కాకముందే రూ. 4వేల పింఛన్‌ను అమలు చేయడమే కాదు.. ఏప్రిల్ నుంచే పథకాన్ని వర్తింపచేస్తూ గడిచిన మూడు నెలలకు మొత్తాన్ని కూడా లబ్ధిదారులకు అందజేశారు. పక్క రాష్ట్రంలో నెల రోజుల్లో ప్రారంభమైతే.. మన రాష్ట్రంలో ఏడు నెలలైనా ఇప్పటికీ ఎన్నికల హామీ అమలు కాకపోవడం చర్చనీయాంశమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడుస్తున్నా పింఛన్లు పెంచకపోవడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్లు రూ.4వేలు, దివ్యాంగుల పింఛన్లు రూ.6వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఆరుగ్యారెంటీల్లో భాగంగా డిసెంబర్ 9 నుంచి పెంచిన పింఛన్లు ఇస్తామని ప్రకటించింది. కానీ 7 నెలలు అవుతున్నా పాత పింఛన్లనే ప్రభుత్వం అమలు చేస్తూ మోసం చేస్తోందని లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆసరా లబ్ధిదారులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్లు చెల్లించాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. పింఛన్లు ఇచ్చే నెలలోనే డిసెంబర్ నుంచి పెరిగిన పింఛను బకాయిలను కూడా ఇవ్వాలని కోరుతున్నారు.

విభజన అంశాలను పరిష్కరించుకుందాం

- సీఎం రేవంత్‌కు ఏపీ సీఎం చంద్రబాబు లేఖ
- 6న హైదరాబాద్‌లో భేటీ అయ్యే అవకాశం

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు. రాష్ట్ర విభజన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకుందామని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేండ్లయినా రెండు రాష్ట్రాల మధ్య కొన్ని సమస్యలు అపరిష్కృతంగా మిగిలాయని తెలిపారు. విభజన హామీల పరిష్కారం ద్వారా.. పరస్పర సహకారం, తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 6న హైదరాబాద్‌లో ముఖాముఖి సమావేశమై చర్చించుకుందామని ప్రతిపాదించారు. ఇరు రాష్ట్రాల మధ్య సామరస్యం, పరస్పర సహకారం ఉంటేనే ప్రభుత్వాల లక్ష్యాలు నెరవేరి అభివృద్ధి సాధించగలుగుతామని పేర్కొన్నారు.

గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ

- మంత్రివర్గ విస్తరణపై సమాచారం
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు రుణ మాఫీ వంటి అంశాలపై చర్చ



గవర్నర్‌తో మాట్లాడుతున్న సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిశారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను గవర్నర్‌కు వివరించారు. కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం నేపథ్యంలో గవర్నర్‌ను హైదరాబాద్‌లోనే ఉండాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. రాధాకృష్ణన్ జార్ఖండ్ రాష్ట్రానికి పూర్తిస్థాయి గవర్నర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. దాదాపు రెండు గంటల పాటు గవర్నర్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి మధ్యాహ్న భోజనం కూడా రాజ్‌భవన్‌లోనే చేశారు. ఈ భేటీలో ప్రధానంగా మంత్రివర్గ విస్తరణ, శాసనసభ పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు, పెండింగ్‌లో ఉన్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు, వాటిపై హైకోర్టు ఆదేశాలు, సభలో ప్రవేశపెట్టనున్న బిల్లులు తదితర అంశాలు చర్చకు వచ్చినట్టు తెలిసింది. ఎన్నికలలో తాము ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీని ఆగస్టు 15 లోగా పూర్తిచేయడానికి రూపొందించుకున్న కార్యాచరణను సీఎం రేవంత్‌రెడ్డి వివరించినట్టు తెలిసింది. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితిపై కూడా వారిద్దరు చర్చించినట్టు సమాచారం.

మంత్రివర్గ విస్తరణపై

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవులలో ప్రస్తుతం నాలుగింటిని మాత్రమే భర్తీ చేయబోతున్నామని గవర్నర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వివరించినట్టు తెలిసింది. ఈ నెల 7 నుంచి ఆషాడ మాసం ప్రారంభం కానుండటంతో ఆ లోగా మంత్రివర్గ విస్తరణ జరగాలని భావిస్తున్నామని చెప్పినట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణతోపాటు మంత్రుల శాఖలను కూడా మార్చబోతున్నామని చెప్పినట్టు తెలిసింది. ఇలా ఉండగా ఐదు రోజుల పాటు ఢిల్లీలోనే ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ విస్తరణకు పార్టీ పెద్దల నుంచి గ్రీన్ సిగ్నల్ పొందడంతో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

క్యాబినెట్‌లో బీసీలకు చోటేది?

మొదటిపేజీ తరువాయి...

ప్రాతినిధ్యం దక్కడం లేదని బలహీనవర్గాలు వాపోతున్నాయి. బడుగు, బలహీన వర్గాల పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్, రాష్ట్రంలో తమ ప్రభుత్వంలో మాత్రం ఆ వర్గాలకు తగిన భాగస్వామ్యం కల్పించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంబలహీన వర్గాల కంటే అగ్రవర్ణాలకే పెద్దపీట వేసింది. ప్రస్తుత మంత్రిమండలిలో సీఎం రేవంత్‌రెడ్డి సహా 12 మంది ఉండగా, వారిలో ఏడుగురు ఓసీ సామాజిక వర్గాలకు చెందిన వారే ఉన్నారు. బడుగు బలహీనవర్గాలకు చెందిన వారు ఐదుగురు ఉన్నారు. ఏడుగురు ఓసీలలో నలుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉండగా, మిగతా ముగ్గురిలో ఒకరు బ్రాహ్మణ, ఒకరు కమ్మ, మరొకరు వెలమ సామాజిక వర్గాలకు చెందినవారు ఉన్నారు. మిగతా ఐదుగురిలో ఇద్దరు ఎస్సీలు (భట్టి విక్రమార్క, దామోదర రాజనరసింహా), ఇద్దరు బీసీలు (కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్), ఎస్టీ (సీతక్క) ఉన్నారు.

విస్తరణలోనైనా న్యాయం జరిగేనా?

రేపో, మాపో జరుగుతుందని భావిస్తున్న మంత్రివర్గ విస్తరణలోనూ తమకు న్యాయమైన వాటా దక్కుతుందన్న గ్యారెంటీ లేదని బడుగు, బలహీనవర్గాలకు చెందిన నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి దామోదర రాజనరసింహా కథనం ప్రకారం మంత్రివర్గ విస్తరణలో నలుగురికి చోటు కల్పించనుండగా వీరిలో ఇద్దరు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారికి, మరో ఇద్దరు బీసీలకు అవకాశం ఉంటుందని తెలిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి పీ సుదర్శన్‌రెడ్డికి చోటు కల్పించబోతున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ లెక్కన ప్రస్తుతం ఉన్న నలుగురు 'రెడ్డి' మంత్రుల సంఖ్య ఆరుకు చేరుకోనుండగా, ఓసీ మంత్రుల సంఖ్య తొమ్మిదికి చేరుకోనుంది. మరో ఇద్దరు బీసీలు.. వాకిటి శ్రీహరి (మక్తల్), దానం నాగేందర్ (హైదరాబాద్)కు కూడా మంత్రి పదవులు దక్కుతాయని మంత్రి పేర్కొన్నారు. అప్పుడు బీసీ మంత్రుల సంఖ్య నాలుగుకు చేరుకోనుంది. మంత్రి దామోదర రాజనరసింహా చెప్పిందే నిజమైతే రాష్ట్ర మంత్రిమండలిలో అగ్రకులాల వారికే పెద్దపీట దక్కనుంది. దీంతో మంత్రివర్గ విస్తరణలోనూ సామాజిక సమతుల్యం లోపించినట్టు అవుతుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

అధికారం లేని పీసీసీ అంటగట్టే ప్రయత్నం

బీసీలకు మంత్రివర్గంలో సరైన ప్రాతినిధ్యం లభించలేదనే విమర్శలను అధిగమించేందుకుగాను ఆ సామాజికవర్గానికి పీసీసీ అధ్యక్ష పీఠం కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ అధ్యక్ష పదవికి పెద్దగా ప్రాధాన్యం ఉండదు. అధికారమంతా సీఎం చేతిలోనే ఉంటుంది. పార్టీ అధ్యక్షుడు మరో పవర్ సెంటర్ కాకుండా ఉండేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తనకు అనుకూలమైన వ్యక్తికే ఈ పదవిని కట్టబెట్టేలా పావులు కదుపుతున్నారు. పీసీసీకి కొత్త అధ్యక్షునిగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ పేరును సీఎం ప్రతిపాదించినట్టు సమాచారం. ఏదైనా కారణంగా మహేశ్‌కుమార్‌గౌడ్‌కు బాధ్యతలు అప్పగించలేనిపక్షంలో మహబూబాబాద్ ఎంపీ బల్‌రాంనాయక్ పేరును కూడా రేవంత్‌రెడ్డి సూచించినట్టు చెప్తున్నారు. తమ దృష్టిలో వీరిద్దరూ డమ్మీ అభ్యర్థులేనని పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం.

రాహుల్ గాంధీకి పంపనున్న లేఖతో బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్

పీసీసీ పీఠాన్ని బీసీకివ్వాలి

- క్యాబినెట్‌లో బీసీలకు పెద్దపీట వేయాలి
- బీసీ రాజ్యాధికార సమితి డిమాండ్

హైదరాబాద్, జూలై1 (నమస్తే తెలంగాణ): ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బీసీకే అవకాశమివ్వాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం పదవితోపాటు త్వరలో చేపట్టే మంత్రివర్గ విస్తరణలో బీసీలకు పెద్దపీట వేయాలని కోరారు. ఈ మేరకు రాహుల్‌గాంధీకి సోమవారం లేఖ రాశారు. సెక్రటేరియట్ మీడియా పాయింట్‌వద్ద ఆ లేఖలోని అంశాలను విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఓసీకి ముఖ్యమంత్రి పదవి, ఎస్సీకి ఉప ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టిన నేపథ్యంలో బీసీలకు పీసీసీ అధ్యక్ష పదవినివ్వాలని డిమాండ్ చేశారు. ఔత్సాహిక బీసీ పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ఉన్నతవర్గాలతో సమానంగా ప్రభుత్వ టెండర్లు, కాంట్రాక్టులు, అవకాశాల్లో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. బీసీ కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు పాలకవర్గాలను ఏర్పాటు చేయడంపాటు చేతివృత్తుల సహకార సంఘాలకు త్వరితగతిన ఎన్నికలు నిర్వహించాలని, ఉదయపూర్ డిక్లరేషన్ అమలు చేయాలని కోరారు. 30 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలకు నిబద్ధుడనై, అధిష్టానానికి, ముఖ్యమంత్రికి విధేయుడుగా ఉన్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్ష పదవికి అన్ని విధాలా అర్హుడనీ, తన అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వానికి మరో సలహాదారు!

- సలహాదారులుగా ఏపీ అధికారులు
- మొన్న ఆదిత్యానాథ్, నేడు శ్రీనివాసరాజు
- ప్రాజెక్టుల సలహాదారుడిగా నియమాకం
- గతంలో సలహాదారులపై విమర్శలు
- నేడు ఎడాపెడా నియామకాలు

హైదరాబాద్, జూలై 1(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం మరో సలహాదారును నియమించుకున్నది. ఆంధ్రప్రదేశ్ మాజీ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్‌రాజును మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టుల సలహాదారుడిగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవలే ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్‌ను నీటిపారుదల వ్యవహారాల సలహాదారుడిగా నియమించగా, తాజాగా శ్రీనివాసరాజును నియమించింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సలహాదారులపై నిత్యం విమర్శలు గుప్పించిన రేవంత్‌రెడ్డి, తాము అధికారంలోకి వస్తే సలహాదారుల వ్యవస్థను లేకుండా చేస్తామని అనేక సందర్భాల్లో ప్రకటించారు. సలహాదారుల నియామకాన్ని ఓ నేరంగా చిత్రీకరిస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా మాజీ చీఫ్ సెక్రటరీ సోమేశ్‌కుమార్‌ను సలహాదారుగా నియమించినప్పుడు కోర్టులో సవాల్ చేస్తానని హెచ్చరించారు. ఇప్పుడు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ సలహాదారుల నియామకాన్ని చేపడుతున్నారు.

సంబంధం లేని బాధ్యతలు

ప్రస్తుత ప్రభుత్వం నియమిస్తున్న సలహాదారులకు, వారికి అప్పగిస్తున్న బాధ్యతలకు ఎటువంటి సంబంధం లేకపోవడం విమర్శలకు తావిస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే పబ్లిక్ అఫైర్స్ సలహాదారుడిగా వేం నరేందర్‌రెడ్డిని, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీల సంక్షేమ వ్యవహారాల కోసం మహ్మద్ అలీ షబ్బీర్‌ను, ప్రోటోకాల్ అండ్ పబ్లిక్ రిలేషన్స్‌కు హర్కర వేణుగోపాల్‌ను సలహాదారులుగా నియమించింది. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మల్లు రవిని నియమించారు. బీజేపీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న వెంటనే జితేందర్‌రెడ్డిని కూడా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా నియమించారు. ఆ తర్వాత ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఐఏఎస్ అధికారి ఆదిత్యనాథ్‌దాస్‌ను నీటి పారుదల వ్యవహారాల సలహాదారుడిగా ప్రభుత్వం నియమించింది. ఆయన ఏపీ నీటి పారుదలశాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఆదిత్యనాథ్ హయాంలోనే తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా జలాలను ఆంధ్రాకు తరలించుకుపోయారనే విమర్శలున్నాయి. దుమ్ముగూడెం, పోతిరెడ్డిపాడు, రాయలసీమ ఎత్తిపోతల పథకం అమలులో కూడా ఆయన కీలకపాత్ర పోషించారు. మన రాష్ట్రంలో అనేకమంది నీటిపారుదల రంగ నిపుణులు ఉండగా ఏపీకి చెందిన రిటైర్డ్ అధికారిని నీటి పారుదల వ్యవహారాల సలహాదారుడిగా నియమించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఏపీలో చంద్రబాబునాయుడు గెలిచిన వెంటనే ఇక్కడ ఆదిత్యనాథ్‌దాస్ నియామకం జరగడంతో చంద్రబాబు సూచనల ప్రకారమే ఆయన నియామకం జరిగిందనే వాదనలు ఉన్నాయి. ఇక, హర్కర వేణుగోపాల్ కాంగ్రెస్ పార్టీలో ప్రొటోకాల్ విభాగం సభ్యుడిగా ఉండేవారు. ప్రభుత్వం ఆయనను ప్రొటోకాల్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ వ్యవహారాల సలహాదారుడిగా నియమించడం గమనార్హం. ఎస్సీ,ఎస్టీ,బీసీల సంక్షేమంతో ఎటువంటి సంబంధం లేని షబ్బీర్ అలీని ఆయా వర్గాల సంక్షేమ సలహాదారుడిగా నియమించడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మరో ఏపీ అధికారి నియామకం

తాజాగా ఏపీ మాజీ ఐఏఎస్ అధికారి శ్రీనివాసరాజును ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ సలహాదారుడిగా నియమించారు. ఆయన సుదీర్ఘకాలంపాటు టీటీడీలో జేఈవోగా పనిచేశారు. అక్కడ టీటీడీ ఈవోగా నియమిస్తారని భావించినప్పటికీ, ఏపీ ప్రభుత్వం అవకాశం కల్పించకపోవడంతో ఇటీవలే ఆయన వీఆర్ఎస్ తీసుకున్నారు. గత నెల 25న ఏపీ ప్రభుత్వం శ్రీనివాసరాజు వీఆర్ఎస్ దరఖాస్తును ఆమోదించింది. 2008 బ్యాచ్‌కు చెందిన ఆయన ఏప్రిల్ 2020 నుంచి ఈ ఏడాది మే వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఇంటర్ క్యాడర్ డిప్యుటేషన్‌పై ఆర్‌అండ్‌బీ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీగా పనిచేశారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఆదేశాలపై ఇటీవలే ఆయన తెలంగాణ నుంచి రిలీవ్ అయి ఏపీలో రిపోర్ట్ చేశారు. అయితే, అక్కడ ఎటువంటి బాధ్యతలు చేపట్టకుండానే వీఆర్ఎస్ తీసుకోగా, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆయనను సలహాదారుడిగా నియమించింది. తెలంగాణ ప్రభుత్వ ముందస్తు హామీ ప్రకారమే ఆయన ఇక్కడి నుంచి రిలీవ్ అయి ఏపీకి వెళ్లి వీఆర్ఎస్ తీసుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఇందిరమ్మ ఇండ్ల కోసం రాష్ట్రాల్లో అధ్యయనం

- ఓఆర్ఆర్-ట్రిపుల్ ఆర్ మధ్య నిర్మించనున్న ప్రభుత్వం
- బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పేదలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇచ్చేందుకు ఇతర రాష్ట్రాల్లోని నమూనాలపై అధ్యయనం చేయించి, త్వరగా నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ప్రతి నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను నిర్మించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నట్టు చెప్పారు. బడ్జెట్ ప్రతిపాదనలపై సోమవారం ఆయన సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గృహనిర్మాణ, రెవెన్యూ, సమాచార శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు, రీజినల్ రింగ్ రోడ్డుకు మధ్య రెవెన్యూ శాఖ నుంచి భూమిని సేకరించుకోవాలని, ఇందిరమ్మ ఇండ్లలో సోలార్ విద్యుత్తు వ్యవస్థలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల గురించి ఆయన ప్రశ్నించడంతో.. జీహెచ్ఎంసీ పరిధిలో 69 వేల డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారని, మరో 31 వేల డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణంలో ఉన్నాయని అధికారులు వివరించారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ పాల్గొన్నారు.

ఐదేండ్లలో 22.50 లక్షల ఇండ్లు నిర్మిస్తాం: పొంగులేటి

అనంతరం గృహనిర్మాణ శాఖ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. రానున్న ఐదేండ్లలో రాష్ట్రవ్యాప్తంగా 22.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. దీనిలో భాగంగా ఈ ఏడాది మొదటి దశలో నియోజకవర్గానికి 3,500 చొప్పున మొత్తం 4,16,500 ఇండ్లు, రిజర్వ్ కోట కింద మరో 33,500 ఇండ్లు నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇందు కోసం బడ్జెట్‌లో రూ.22,500 కోట్లు కేటాయించాలని ఆర్థిక శాఖ మంత్రి భట్టివిక్రమార్కను కోరినట్టు చెప్పారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్ పాల్గొన్నారు.

సన్నాల సీఎమ్మార్ నిబంధనలు సడలించండి

- ప్రభుత్వాన్ని కోరుతున్న రైస్ మిల్లర్లు
- సివిల్‌సప్లైపై నేడు కమిషనర్ సమీక్ష
- రేపు సీఎం రేవంత్ రెడ్డి ..

హైదరాబాద్, జులై 1(నమస్తే తెలంగాణ): సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో వానకాలంలో కొనుగోలు కేంద్రాలకు ఎక్కువగా సన్నధాన్యం వచ్చే అవకాశం ఉన్నది. ఈ తరుణంలో ప్రభుత్వానికి బియ్యం ఇచ్చే ప్రక్రియ కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్) నిబంధనల్లో మార్పులు చేయాలని రైస్ మిల్లర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సీఎమ్మార్ ఔట్‌రట్న్ రేషియో (ధాన్యం నుంచి బియ్యం వచ్చేది), నూకశాతం నిబంధనను తగ్గించాలని కోరుతున్నారు. ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారం సీఎమ్మార్ రారైస్‌కు మిల్లర్లు 67